# సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



**ఇళ్ల గల్లంతుపై మళ్లీ విచారణ**

పోలవరం ప్రాజెక్టులో ఇళ్లను కోల్పోతున్న అర్హులైన నిర్వాసితుల పేర్లను తొలగించగా.. మళ్లీ ఈ పేర్లపై విచారించాలని తాజాగా ఆదేశాలు అందాయి. 8లో ▸



**వరిసాగులో యంత్రాల జోరు**

వరి సాగులో యంత్రాల వినియోగం ఏటా పెరుగుతోంది. దమ్ములు, నాట్లు, కోతల సమయంలో యంత్రాల వినియోగం జోరుగా ఉంది. 8లో ▸



**బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి**

బ్రాహ్మణుల అభివృద్ధికి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య పనిచేస్తుందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. మంగళవారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. 8లో ▸

## న్యూస్‌రీల్

### నేలనంటిన వరి



అలంపురంలో పడిపోయిన వరిచేలు

పెంటపాడు: గత రెండు మూడు రోజులుగా వీస్తున్న ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాలలో చేలు నేలనంటాయి. కోతకు సిద్ధంగా పొలాలు నేలనంటడంతో నష్టపోయామంటూ అలంపురం, రావిపాడు రైతులు వాపోతున్నారు.

### విద్యార్థుల ఆత్మహత్యలు సరికాదు

**3వ అదనపు జిల్లా జడ్జి సోమశేఖర్**

భీమవరం: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ఆత్మహత్య చేసుకోవడం మంచిది కాదని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో హితవు చెప్పారు. ఆత్మహత్యలు కుటుంబసభ్యులను శోకసముద్రంలో ముంచుతాయని.. పరీక్షా ఫలితాలు వెలువడక ముందు తప్పుతామనే భయంతో కొందరు, ఫలితాలు వచ్చాక తల్లిదండ్రులు మందలిస్తారని మరి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పరీక్ష తప్పినంత మాత్రాన పెద్దగా నష్టమేమి ఉందని, తదుపరి పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత కాకుంటే ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డైరెక్టుగా డిగ్రీ చేసే అవకాశముందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు.

### వక్ఫ్ సవరణ బిల్లుపై రాజీలేని పోరు



కైకలూరు తాలూకా సెంటర్‌లో నిరసన

కైకలూరు: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర వెనక్కి తీసుకునే వరకు రాజీలేని పోరాటం చేస్తామని ముస్లిం సోదరులు ముక్తకంఠంతో చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా కైకలూరు మాగంటి సెంటర్ నుంచి ఏలూరు రోడ్ వరకు ముస్లింలు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. తాలూకా సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి, రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని నినాదాలు చేశారు. వక్ఫ్ ఆస్తులు పరిరక్షించుకోడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకునే వరకు కేంద్రంతో పోరాడతామన్నారు. లౌకిక, అభ్యుదయ వాదులందరూ మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ.జానీ, షేక్ రఫీ, రఫీ బాషా, షాబుద్దీన్, గఫూర్, షేక్ మూసా, ఎండీ సిరాజ్, ఎండీ ఉస్మాన్, షేక్ సుభానీ, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

### ఉల్లాస్ పథకంలో ప్రతి ఒక్కరికీ విద్య

భీమవరం (ప్రకాశంచౌక్): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చదువు ఎంతో ముఖ్యమని, అందులో భాగంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కన్వర్జెన్సీ కమిటీ సమావేశాన్ని కమిటీ మెంబర్లతో నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ పథకం ప్రధానంగా పెద్దలతో సహా పాఠశాల విద్యను కోల్పోయిన ప్రతి ఒక్కరికి విద్యా అవకాశాలను అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలోని 21,628 మంది స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులను లక్ష్యంగా చేసుకొని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మే 5 నుంచి సెప్టెంబర్ 20 వరకు అక్షరాస్యత కార్యక్రమం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో రోజు ఒక గంట విద్యను నేర్పిస్తారన్నారు. సమావేశంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### విపత్తుల నిర్వహణ శాఖ మేనేజర్‌గా భవానీ

భీమవరం (ప్రకాశంచౌక్): విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజరుగా కె.భవానీ నియమితులయ్యారు. రెవెన్యూ శాఖ నుంచి బదిలీపై ఆమె జిల్లాకు వచ్చారు.

### ఈడా ఏఓగా నగీనా సుల్తానా

ఏలూరు (టూటౌన్): ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డీటీవీ కృష్ణారావు సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గ్రేడ్ 3 కమిషనర్ నగీనా సుల్తానాను నియమించారు.

# నింగి నుంచి నిఘా

- పోలీస్ పెట్రోలింగ్‌లో డ్రోన్ల వినియోగం
- స్టేషన్ నుంచే అసాంఘిక కార్యకలాపాలపై నిఘా
- డ్రోన్ కెమెరాల సాయంతో 370 కేసుల నమోదు
- అన్ని స్టేషన్లకూ సమకూర్చే ప్రయత్నంలో యంత్రాంగం

**ఏప్రిల్ 5**

**ఉండి పోలీసు స్టేషన్ పరిధిలో డ్రోన్‌తో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో కోలమూరు, పాందువ్వ గ్రామాల శివార్లలోని చెరువుల వద్ద పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వారి నుంచి** రూ.7,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. చెరువుగట్ల వెంట పేకాటరాయుళ్లు పరుగులు తీసిన సమయంలో డ్రోన్‌లో చిత్రీకరించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.



డ్రోన్ నిఘాతో చెరువుల వద్ద పేకాటాడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

సాక్షి, భీమవరం: చుట్టుపక్కల ఎవరూ లేరు.. నిర్మానుష్య ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఎవరూ పట్టుకోలేరు అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్టే.. క్లౌడ్ పెట్రోలింగ్ రూపంలో నింగి నుంచి నిఘా ఉందన్న విషయం మరువద్దంటున్నారు పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో, కేసుల ఛేదనలో ఇప్పుడు డ్రోన్ కెమెరాలు రంగ ప్రవేశం చేస్తున్నాయి. జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ల పరిధిలో 25 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. కాలానికి అనుగుణంగా శాంతిభద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది పోలీసు శాఖ. సార్వత్రిక ఎన్నికల సమయంలో మూడు సబ్‌డివిజన్లకు లక్షలు ఖరీదు చేసే మూడు డ్రోన్ కెమెరాలు అందుబాటులోకి తెచ్చారు. ఇవి కిలోమీటరు వరకు ఎత్తు ఎగిరి, చుట్టూ రెండు కిలోమీటర్లు వరకు నిఘా ఉంచుతాయి. ఖాళీ ప్రదేశాల్లో మూడు కిలోమీటర్ల దూరం వరకు వెళతాయి. రాత్రి సమయంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) కెమెరా ద్వారా సమర్థవంతంగా పనిచేస్తాయి. ప్రస్తుతం సబ్ డివిజన్‌కు ఒకటి ఉండగా ప్రతి పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరాలను సమకూర్చే పనిలో జిల్లా యంత్రాంగం ఉంది. అందులో భాగంగా ఇప్పటికే నరసాపురం సబ్ డివిజన్ పరిధిలోని స్టేషన్లలో టెక్నాలజీపై నైపుణ్యం కలిగిన కానిస్టేబుళ్లకు డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇవ్వగా మిగిలిన సబ్ డివిజన్లలోను శిక్షణ ఇవ్వనున్నట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి.

**క్లౌడ్ పెట్రోలింగ్‌తో గస్తీ**

డ్రోన్ కెమెరా వినువీధులోకి దూసుకువెళ్లి క్లౌడ్ పెట్రోలింగ్ చేస్తుంది. అసాంఘిక శక్తుల జాడను ఇట్టే పసిగడుతుంది. కేసులు ఛేదించేందుకు ఇవి దారి చూపుతున్నాయి. ఈవ్ టీజింగ్, పరిమితికి మించిన వేగంతో బైక్ రైడింగ్, బహిరంగ ప్రదేశాలు, రైల్వే ట్రాక్‌ల వెంట, అనుమానిత ప్రాంతాల్లో మద్యపానం, పేకాట, కోడిపందేలు తదితర అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ల ద్వారా పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఇంతవరకు 370 వరకు కేసులు నమోదు చేశారు. ఎక్కడైనా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడినప్పుడు డ్రోన్ల ద్వారా పైనుంచి అనుమానితుల కదలికలపై నిఘా పెడుతున్నారు.



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

**నిరంతర నిఘా**

జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. అనుమానిత ప్రాంతాల్లో నిఘా ఉంచి నిందితులను పట్టుకుంటున్నాం. మరిన్ని డ్రోన్లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు చట్టాన్ని గౌరవించి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి.

– అద్నాన్ నయీం అస్మి, జిల్లా ఎస్పీ



తప్పిపోయిన చిన్నారిని నారాయణమ్మకు అప్పగిస్తున్న పోలీసులు

**మార్చి 25**

భీమవరం రూరల్ చిన్నగొల్లపాలెంకు చెందిన బొర్రా వెంకటనారాయణమ్మ తన మనవడు, మనవరాలు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించేందుకు పట్టణంలోని హెడ్ పోస్టాఫీసుకు వచ్చింది. బయటకు వెళ్లి వాటర్ బాటిల్ తెచ్చేసరికి తన 7 ఏళ్ల మనవరాలు దివ్య కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సమీప ప్రాంతాల్లో గాలించినా దొరక్కపోవడంతో డ్రోన్ కెమెరాను రంగంలోకి దింపారు. శ్యామ్ స్కిల్స్ సమీపంలో చిన్నారిని గుర్తించి నారాయణమ్మ చెంతకు చేర్చారు.

## ఇసుక అందుబాటులో ఉంచాలి

**కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం (ప్రకాశంచౌక్): డిమాండ్‌కు అనుగుణంగా వర్షాకాలం కంటే ముందుగా అన్ని నియోజకవర్గాల్లో ఇసుకను అందుబాటులో ఉంచేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా పెండ్యాలలో ఓపెన్ ఇసుక రీచ్‌ను పశ్చిమగోదావరి జిల్లాకు మాత్రమే ప్రత్యేకంగా కేటాయించారని చెప్పారు. జిల్లాకు 5 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంగా వర్షాకాలం కంటే ముందుగా ప్రతి నియోజకవర్గంలో 70 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను డంపు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని రవాణా పూర్తి చేయాలన్నారు. భీమవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఉండి, తాడేపల్లిగూడెం స్టాక్ యార్డులను ఏర్పాటు చేశారని, ప్రతిరోజు సుమారు 60 ట్రక్కులకు తక్కువ కాకుండా ఇసుక రవాణా చేపట్టాలన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, గనులు భూగర్భ శాఖ అధికారి బి.రవికాంత్, ఆర్డీవో ఉమామహేశ్వరరావు, భూగర్భ జల శాఖ అధికారి కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## 17న స్థాయీ సంఘం సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 17న ఉదయం 10 నుంచి నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు.

# పేదోడిపై ప్రతాపం.. బడాబాబులపై కనికరం

- రోడ్ల వెంట చిరు వ్యాపారులు, పేదల షెడ్ల తొలగింపు
- పంట బోదెలు ఆక్రమించుకున్న పెద్దలపై మెతక వైఖరి

ఉండి: ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటే ఎవరైనా ఉపేక్షించం అంటూ ఉండి నియోజకవర్గ వ్యాప్తంగా అధికారుల చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అయితే సామాన్యులు, పేదలు ఏళ్ల తరబడి ఉంటున్న ఇళ్లను కూలగొట్టి వారిని రోడ్డున పడేశారు. వారికి ప్రత్యామ్నాయాలు చూపకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. అయితే బడాబాబులు, అధికార పార్టీ నేతలు ఆక్రమించుకున్న స్థలాల వైపు మాత్రం కన్నెత్తి చూడడం లేదు.

పొట్టకూటికోసం రోడ్ల పక్కన చిన్న బడ్డీ కొట్లు, రేకులతో తాత్కాలికంగా షెడ్లు నిర్మించుకున్న వారిపై, రోడ్ల పక్కన చేపలు, మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిపై ప్రతాపం చూపించారు. ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో నిరుపేదల ఇళ్లను కూలగొట్టారు. పరీక్షల సమయం దయచేసి కరెంటు ఇవ్వండి.. తరువాత ఏదో చోటికి వెళ్లిపోతాం అని విద్యార్థులు వేడుకున్నా కనికరించలేదు. నిరుపేదలు, చిరువ్యాపారులపై ప్రతాపం చూపించిన అధికారులు బడాబాబులు ప్రభుత్వ స్థలాలు, పంటబోదెలు ఆక్రమించుకున్నా అవి ఆక్రమణలు కావు అన్నట్లు కన్నెత్తి కూడా చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



ఉండి గణపవరం రోడ్డులో పంట బోదెను ఆక్రమించి నిర్మించిన షెడ్డు



ఉండి-గణపవరం రోడ్డులో బోదెను ఆక్రమించి ఫెన్సింగ్



దుకాణం తొలగించడంతో ఉండిలో చిన్న గుడ్డ కట్టుకుని సైకిల్ రిపేర్ చేసుకుంటున్న యువకుడు

**ఇవన్నీ ఆక్రమణలు కావా ?**

ఉండి గణపవరం రోడ్డులో పంటబోదెను ఆక్రమించుకుని భారీ షెడ్డు నిర్మించగా.. పక్కనే ఉన్న ఓ రొయ్యల ఫ్యాక్టరీ యజమాని పంటబోదెను ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసినా, మద్యం దుకాణం ఏర్పాటు చేసి బోదె ఆక్రమించుకున్నా గానీ అధికారులకు కనిపించడం లేదు. బడాబాబులపై ఎందుకు మెతక వైఖరి అవలంభిస్తున్నారని విమర్శిస్తున్నారు. భారీ ఆక్రమణలకు ఎదురుగా కాలువ పక్కగా కొంతకాలం క్రితం పూరిపాకలు నిర్మించుకుని జీవిస్తున్న కొందరి ఇళ్ళను పీకి పారేశారు. ఎదురుగా ఉన్న భారీ ఆక్రమణలు మాత్రం కనిపించలేదా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత వేసవి ఎండల్లో చేసేది లేక చిరువ్యాపారులు ఎండల్లోనే పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు.

## కోకో ధరలపై ఒప్పంద ప్రకటన చేయాలి

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద ప్రకటన చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని కోరుతూ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుల సంఘం ప్రతినిధి బృందంతో ఎంపీ చర్చించారు. కోకో రైతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ ధర రాకపోవడంతో కోకో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.750కు పైగా ధర ఉన్నా రూ.450 నుంచి రూ.550 మాత్రమే ఇస్తున్నారన్నారు. పాత గింజలు కొనుగోలు చేయడం లేదన్నారు. ఈ నెల 3న వ్యవసాయ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీలు, ట్రేడర్లతో సమావేశం జరిగిందని.. ఈ నెల 7 లోపు ధరల నిర్ణయ ప్రకటన చేస్తామని చెప్పారన్నారు. ఇంతవరకు నిర్ణయం కాకపోవడంతో కంపెనీలు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాత గింజలకు కిలోకు రూ.300, కొత్త గింజలకు కిలోకు రూ.550 అంటూ ప్రచారం చేయడంతో రైతులు మరింతగా నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ధర ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ కోకో రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న కోకో రైతు సంఘం నాయకులు

## పీఎం సూర్యఘర్ అమలు తీరుపై అసంతృప్తి

భీమవరం (ప్రకాశంచౌక్): పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు వినియోగానికి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పథకం అమలుపై విద్యుత్ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 14,392 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయగా 917 గృహాలకు మాత్రమే సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేశారన్నారు. పథకం అనుకున్నంత వేగంగా జరగటం లేదని అసహనం వ్యక్తం చేశారు. నెలకు ప్రతి మండలానికి 24 కనెక్షన్లు పూర్తి చేసేలా శ్రద్ధ వహించాలని సూచించారు. సోలార్ విద్యుత్‌కు దరఖాస్తు చేసుకుని పెండింగ్ లో ఉన్నవారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

# పూర్వ వైభవం దక్కేనా!

- జిల్లాలో నాటకాలకు పెరుగుతున్న ఆదరణ
- నాటకాలతో ప్రజలను చైతన్యపర్చిన ఉమ్మడి పశ్చిమ గోదావరి
- పరిషత్‌ల నిర్వహణలో నాటక రంగ పోషణ
- నేడు తెలుగు నాటక రంగ దినోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కందుకూరి వీరేశలింగం పంతులు వ్యవహార ధర్మబోధిని నాటకాన్ని రచించి, తొలిసారిగా రంగస్థలంపై ప్రదర్శించిన రోజు కావడంతో ఏటా ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. అప్పట్లో టిక్కెట్లు కొని నాటకాలు చూసేవారు. ప్రముఖ కళాకారుల నాటకాలు చూసేందుకు జనం ఎగబడేవారు. అనంతరం సినిమాలు, టీవీలు, ఇటీవలి మొబైల్ ఫోన్లు రావడంతో నాటకాలకు ఆదరణ తగ్గింది. అయినప్పటికీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక నాటక కళా పరిషత్‌లు పోటీలు నిర్వహిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్నాయి. నాటక రంగానికి ఊపిరులూదే ప్రయత్నం చేస్తున్నాయి.

**ఎందరో మహానుభావులు..** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎందరో నాటక రచయితలు అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందారు. తిరుపతి వేంకట కవుల గురించి పరిచయం అవసరం లేదు. అనేక పౌరాణిక నాటకాలు రచించి నటులు, దర్శకులకు మార్గదర్శకులయ్యారు. మత్స్యపురికి చెందిన కాళ్ళకూరి నారాయణరావు రచించిన చింతామణి ఒకప్పుడు ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్నే ఉర్రూతలూగించింది. దెందులూరుకు చెందిన ఎస్ఆర్ నంది రచించిన మరో మొహంజదారో నాటిక ఉర్రూతలూగించింది. ఏలూరుకు చెందిన కోడూరుపాటి సరస్వతి రామారావు రచించిన సాని- సంసారి నాటిక సాంఘిక నాటకాలకు దిక్సూచిగా నిలిచింది. బందా కనకలింగేశ్వర రావు నాటకాల్లో నృత్యాలను, పాటలను ప్రవేశపెట్టి నాటకాలను ప్రజారంజకంగా మలచడంలో కీలకపాత్ర పోషించారు.



సాంఘిక నాటకాలు

**ప్రభుత్వం ఆదరించాలి**



మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో నాటక రంగానికి ఆదరణ తగ్గుతోంది. కరోనా అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 కొత్త పరిషత్‌లు వచ్చాయి. నేటి తరంలో నాటకరంగంపై ఆసక్తి కలిగించడానికి ప్రాథమిక విద్యలో నాటకరంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి. దేవాలయాల్లో నిర్వహించే ఉత్సవాల్లో నాటకాలను ప్రదర్శించేలా ప్రోత్సహించాలి. నాటక రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది.

– బుద్దాల వెంకట రామారావు, బీవీఆర్ కళాక్షేత్రం అధినేత, తాడేపల్లిగూడెం

**సాంఘిక నాటకంపై తాళాబత్తుల ముద్ర**



తాళాబత్తుల వెంకటేశ్వరరావు

పాలకొల్లుకు చెందిన తాళాబత్తుల వెంకటేశ్వర రావు సాంఘిక నాటక రంగంలో గుర్తింపు పొందారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నప్పటికీ నాటక రంగంపై మక్కువతో అనేక నాటకాలు రచించడంతో పాటు నటుడిగా రాణిస్తున్నారు. ఆయన రచించిన సైకత శిల్పం, నాన్నా నేనొచ్చేసా, అనూహ్యం, తప్పటడుగులు, సప్తపది, దిష్టిబొమ్మలు, నాన్నా నన్ను క్షమించండి, మనిషికీ మనిషికీ మధ్య వంటి సంచలన విజయాలు అందుకున్నాయి.

**నాటక రంగంపై చెరగని ముద్ర**

జిల్లాకు చెందిన అనేక మంది నాటక రంగంపై చెరగని ముద్ర వేశారు. పౌరాణిక నాటకాల్లో షణ్ముఖి ఆంజనేయరాజు అగ్రగణ్యుడు. ఆయన పద్యాలు అందుకుంటే ప్రేక్షకులు మంత్ర ముగ్ధులయ్యేవారు. తాడేపల్లిగూడెంకు చెందిన మద్దాల రామారావు నాటక రంగంపై తనదైన ముద్ర వేశారు. అనేక మంది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కళాకారులు నాటకరంగాన్ని ఒక ఊపు ఊపారు.

**నాటకాన్ని నిలబెడుతున్న కళాపరిషత్‌లు**



ఎండీ ఖాజా వలీ, రంగస్థల దర్శకుడు

జిల్లాలోని పలు సంస్థలు పరిషత్‌లు నిర్వహిస్తూ నాటక రంగాన్ని పోషిస్తున్నాయి. తోలేరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వర నాటక కళాపరిషత్, వీరవాసరానికి చెందిన వీరవాసం కళాపరిషత్, భీమవరానికి చెందిన చైతన్య కళాభారతి, కళారంజని కళా పరిషత్‌లు.. ఏలూరుకు చెందిన హేలాపురి కళాపరిషత్, గరికపాటి కళా పరిషత్, పాలకొల్లు నాటక కళా పరిషత్ సంస్థలు ఏటా నాటక పోటీలు నిర్వహిస్తూ రాష్ట్రంలోని ప్రముఖ సంస్థలకు చెందిన కళాకారులను ఆయా ప్రాంతాలకు ఆహ్వానించి, పోటీలతో పాటు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాయి. 1995లో రాష్ట్ర ప్రభుత్వం నంది నాటకోత్సవాలు ప్రారంభించి నంది అవార్డులను ఇస్తోంది. 2009లో ఖాజావలీ దర్శకత్వంలో ప్రదర్శించిన ఎవరో ఒకరు సాంఘిక నాటకం బంగారు నందితో పాటు 5 కాంస్య నందులు గెలుచుకుంది. ఆ తరువాతి సంవత్సరం వలీ దర్శకత్వంలోనే 2010లో సైసై జోడెడ్ల బండి నాటకానికి బంగారు నందితో పాటు 5 కాంస్య నందులు వరించాయి. 2012లో మహాసాధ్వి శకుంతలకు వెండి, కాంస్య నంది, 2017లో ఇంద్రసింహాసనం పౌరాణిక నాటకానికి బంగారు నందితో పాటు 5 కాంస్య నందులు వచ్చాయి.

## క్లుప్తంగా

### యర్రంపేట వాసికి గిన్నిస్ బుక్‌లో చోటు


గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిన ప్రసాద్

కొయ్యలగూడెం: యర్రంపేటకు చెందిన కీబోర్డ్ కళాకారుడు జీవన్ ప్రసాద్ గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించాడు. మంగళవారం ఆ వివరాలకు విలేకరులకు వెల్లడించారు. హాలెల్ అంతర్జాతీయ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో పద్దెనిమిది దేశాలకు చెందిన కీబోర్డ్ కళాకారులతో ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లో కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. గంటసేపు అంతరాయం లేకుండా ప్లేచేస్తూ నైపుణ్యత కనబరిచిన 1046 మందిని విజేతలుగా ప్రకటించారన్నారు. విజేతల్లో తాను ఉన్నానని, ఈ నేపథ్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేశారన్నారు. గిన్నిస్ అధ్జిడికేటర్ రిచర్డ్ స్టిన్నింగ్ అవార్డులను హైదరాబాదులో ప్రదానం చేసినట్లు చెప్పారు.

### 'అక్కడ అమ్మాయి- ఇక్కడ అబ్బాయి' చిత్ర బృందం సందడి


భీమవరంలో నటీనటులు ప్రదీప్, దీపిక పిల్లి

భీమవరం: భీమవరం ఏవీజీ సినిమాస్‌లో 'అక్కడ అమ్మాయి- ఇక్కడ అబ్బాయి' చిత్ర బృందం మంగళవారం సందడి చేసింది. హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక పిల్లి యూనిట్ సభ్యులతో ప్రేక్షకులతో మాట్లాడారు. తమ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

### క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్ / టౌన్: ఈ నెల 17, 18 తేదీల్లో ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్, అండర్-23, అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా వేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్స్ అధ్యక్షుడు జి ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్‌ఎం శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఈ పోటీలు వాయిదా వేశామని, తదుపరి తేదీలను పత్రికల ద్వారా ప్రకటిస్తామని వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌పై వచ్చిన పలు ఆరోపణలపై విచారణకు త్రిసభ్య కమిటీని నియమించిందని కమిటీ చైర్మన్ చవాకుల కాశీ విశ్వేశ్వరరావు మరో ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిబంధనలు పాటించకపోవటంతో వెస్ట్‌గోదావరి డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ఏవిధమైన కార్యకలాపాలు నిర్వహించకుండా నిలుపుదల చేశారని పేర్కొన్నారు.

### వేతన బకాయిలు విడుదల చేయాలి

భీమడోలు: ఉపాధి కార్మికులకు రెండు నెలలుగా రావాల్సిన వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలు సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండీఎం నిర్వాహకులకు రెండు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చిరుద్యోగులు, కూలీల వేతన బకాయిలను నెలల తరబడి పెండింగ్ పెట్టడం దారుణమన్నారు.

# వరిసాగులో యంత్రాల జోరు

- యంత్రాలపైనే ఆసక్తి చూపుతున్న రైతులు
- ప్రస్తుతం యంత్రాలతో ముమ్మరంగా వరికోతలు
- ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలు


యంత్రంతో వరికోతలు చేపట్టిన దృశ్యం

పెంటపాడు: వరి సాగులో రైతులు కొత్తవంగడాలు వినియోగించడంతో పాటు వినూత్న రీతిలో సాగు చేస్తున్నారు. దీనిలో భాగంగా యంత్రాల వినియోగం ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. రైతుల ఆలోచనలకు తగ్గట్టు యంత్రాలు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. చిన్న సన్నకారు రైతులు మినహా మిగిలిన రైతులు యంత్రాలు కొనుగోలు చేసి వరి సాగులో జోరుగా వాటిని వినియోగిస్తున్నారు. మరికొందరు రైతులు యంత్రాలను అద్దెకు తీసుకొంటూ సాగు చేస్తున్నారు. వరి సాగు ప్రారంభంలో ట్రాక్టర్లతో దమ్ములు చేయడంతో పాటు వరి నాట్లు వేయడంలోనూ యంత్రాలు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వరి కోతలు సమయం కావడంతో యంత్రాల సాగు జోరుగా ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు అనుగుణంగా రాత్రి పగళ్లు పొలాల్లో బీజీగా గడుపుతూ యంత్రాల సాయంతో నూర్పులు చేపడుతున్నారు. కాగా ప్రస్తుతం దాళ్వా మాసూళ్ల విషయంలో రైతులకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. కానీ ప్రస్తుతం బంగాళాఖాతంలో తుఫాను నేపథ్యంలో సరిగ్గా కోతల సమయంలోనే వర్షాలు కురుస్తూ, ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ సమయంలో యంత్రాల వినియోగం రైతులకు మేలు చేస్తోంది.

**వినియోగంపై ఆసక్తి**

తక్కువ సమయంలో ఎక్కువ పని చేసేందుకు అలాగే పెట్టిన రాబడి రాబట్టుకొనేందుకు రైతుల యంత్రాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరా సాగు చేసేందుకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతుంది. అదే యంత్రాలు ఉపయోగించి సాగు చేస్తే రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు అవుతోంది. అలాగే ప్రస్తుతం ఎకరం వరి కోత కూలీలకు రూ.5500 కాగా, అదే యంత్ర సాయంతో రూ.2400 ఖర్చు అవుతోంది. దీంతో సగానికి పైగా ఖర్చు తగ్గుతోంది. ఏళ్ల తరబడి వ్యవసాయ పనులను నమ్ముకున్న కూలీలకు యంత్రం వల్ల ఉపాధి లేకుండా పోయింది. దీని వల్ల వారు పనుల కోసం వలసబాట పడుతున్నారు. కొంతమంద కూలీలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకొంటూ ఉపాధి పొందుతున్నారు.

### సమయం, ఖర్చు ఆదా



ప్రస్తుతం వరికొతలను యంత్రాల ద్వారా సాగు చేస్తున్నారు. తక్కువ సమయంతో పాటు పెట్టుబడి కూడా తక్కువ అవుతుంది. దీంతో మాకు కొంత పెట్టుబడి మిగులుతుంది. ప్రస్తుతం దాళ్వా కోతల సీజన్ కావడం తో యంత్రాలతో మాసూళ్లు చేపడుతున్నాం.

– తోరం సుబ్బన్న రైతు, పడమరవిప్పర్రు

### పెట్టుబడి తగ్గుతుంది



ప్రసుత్త వరి కొతలను యంత్రాల సాయంతో చేయడం వల్ల అనుకున్న సమయాని కంటే ముందే పని పూర్తవ్వుతోంది. ఎకరా కోత నూర్పు చేయడానికి రూ.3600 ఖర్చు అవుతోంది. అదే కూలీలను పెట్టి కోస్తే రూ.5 వేలు అవుతుంది.

– పాలా గణపతి, కొండేపాడు

### ఎస్‌ఆర్‌కేఆర్ ప్రోత్సాహంతో ఉన్నత స్థానం

ఉప రాష్ట్రపతి పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ సుమ


కళాశాలలో సుమను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అందించిన ప్రోత్సాహమే తమ ఉన్నతికి కారణమని డీఏఎన్ ఐపీఎస్ అధికారిణి, ఢిల్లీ పోలీస్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్, భారత ఉపరాష్ట్రపతి పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ మద్ద సుమ అన్నారు. మంగళవారం తాను చదువుకున్న ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు తన భర్త, కళాశాల పూర్వ విద్యార్థి, శ్యాంసంగ్ ఆర్‌అండ్‌డీ విభాగం జనరల్ మేనేజర్ బి అనిల్ కుమార్‌తో కలిసి వచ్చి ఈసీఈ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని సుమ స్పష్టం చేశారు. తన సోదరుడు ఎం నీలాజలం కూడా ఇక్కడే చదివి అనంతరం పీజీ చేసి పోటీ పరీక్షల్లో విజయం సాధించి భీమవరంలోనే ఆదాయపు పన్ను శాఖ అధికారిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఈసీఈ విభాగం హెడ్ డాక్టర్ ఎస్ ఉదయ్ కుమార్, ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పుష్ప గుచ్ఛాలు అందించి వారిని అభినందించారు.

# నిర్వాసితుల ఇళ్ల గల్లంతుపై మళ్లీ విచారణ

- గతంలో పేర్లు తొలగించిన స్పెషల్ కలెక్టర్ సరళావందనం
- మళ్లీ విచారించాలని తాజాగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ఆదేశం
- ఇంటింటికీ తిరిగి నోట్ కెమెరాతో ఫొటోలు తీస్తున్న అధికారులు


జగన్నాథపురంలో ఇండ్లను పరిశీలిస్తున్న ఏలూరు ఎస్‌డీసీ వాకా శ్రీనివాసరెడ్డి

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్టులో ఇళ్లను కోల్పోతున్న అర్హులైన నిర్వాసితుల పేర్లను తొలగించిన స్పెషల్ కలెక్టర్ సరళావందనం మళ్లీ ఈ పేర్లపై విచారించాలని తాజాగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏలూరు-2 కు లిఖితపూర్వకంగా ఆదేశించారు. ప్రభుత్వం నోటిపై చేసిన అవార్డు ఉత్తర్వులో వేలేరుపాడు మండలం జగన్నాధపురంలోని 140 మంది నిర్వాసితుల పేర్లను స్పెషల్ కలెక్టర్ సరళ వందనం తొలగించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనం గత ఏడాది అక్టోబర్ నెలలో అప్పటి ఏలూరు ఎస్‌డీసీ ముక్కంటితో విచారణ చేయించారు. అప్పట్లో వేలేరుపాడు తహసీల్దార్, వీఆర్వో, గ్రామ పంచాయితీ కార్యదర్శి, ఎంపీడీఓల సమక్షంలో విచారణ చేపట్టారు. 2015, 2016, 2017 ఇంటి పన్ను రశీదులు పరిశీలించి ఎస్‌డీసీ కార్యాలయానికి అందరి అధికారుల సంతకాలతో పంపారు. మళ్లీ తొలగించిన నిర్వాసితుల ఇండ్లను విచారించాలని, అన్ని ఇండ్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, నిజంగా ఇండ్లు ఉన్నాయా... లేదా? అన్న అంశాలను పరిశీలించాలని పోలవరం స్పెషల్ కలెక్టర్ తాజాగా ఆదేశించారు. దీంతో మంగళవారం ఏలూరు ఎస్‌డీసీ వాకా శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. ఇంటింటింకీ తిరిగి నోట్ కెమెరాతో ఫొటోలు తీశారు. ఇంటి యజమాని అందుబాటులో ఉంటే ఇంటి ముందు నిలబెట్టి ఫొటోలు తీశారు. వీరితో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఏ, వీఆర్వో, ఎస్‌డీసీ కార్యాలయ సిబ్బంది విచారణలో పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య పనిచేస్తుందని ఆ సంఘ నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక అంబిక ఫ్లేవర్స్ ఫంక్షన్ హాల్లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ బ్రాహ్మణులు సామాజికంగా అభివృద్ధి చెందిన వారి జాబితాలో ఉన్నప్పటికీ ఆర్థికంగా అట్టడుగున ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వడానికి రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. అలాగే బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందించాలని, వ్యాపారాలు చేసుకోవడానికి రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా కోనూరు సతీష్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హెచ్‌కే మోహనరావు, కోశాధికారిగా పులిపాక ప్రసాద్, అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా సత్యవాడ దుర్గా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన బ్రాహ్మణులు గండ్లూరి దత్తాత్రేయ శర్మ, గుండు రామనాథ శాస్త్రి, బులుసు అపర్ణ, ఓరుగంటి వెంకట రమణ, శంకరమంచి సుబ్రహ్మణ్య శాస్త్రి, గోపాలుని హరిహరరావు, గామోజీ అపర్ణ ప్రసాద్, సూరంపూడి వీరభద్రరావు, విష్ణుదాస్ శ్రీకాంత్‌లను ఉగాది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

## పైపులైన్ లీకేజీని అరికట్టేందుకు చర్యలు


బౌ బ్రిడ్జిపై ప్రధాన పాత పైపులైన్‌కు కాస్ట్ ఐరన్ పైపు లింక్, రంగులు వేస్తున్న సిబ్బంది


ప్రధాన పైపులైన్‌కు ఏర్పడ్డ లీకేజీ పాత చిత్రం

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బౌబ్రిడ్జి మీదుగా వెళుతున్న తాగునీటి ప్రధాన పైపులైన్ లీకేజీని అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ బౌబ్రిడ్జి వద్ద ఎన్నో ఏళ్లుగా పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడుతుండడంతో నీరు వృథాగా పోతోంది. అంతేగాక పలు ప్రాంతాల్లో సైతం ఏర్పడిన లీకేజీల ద్వారా నీరు కలుషితమవుతోందని, తోక పురుగులు వస్తున్నాయని ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షి కథనాలను ప్రచురించింది. ఎప్పటికప్పుడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించడం.. మళ్లీ కొన్నాళ్లకు లీకేజీలు ఏర్పడడం షరామామూలే. ప్రస్తుతం దీనిపై స్పందించిన అధికారులు ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు రూ.2 లక్షల వ్యయంతో కాస్ట్ ఐరన్ పైపును లింక్ చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో అధికారులు ఎంఈ వెంకటరమణ, డీఈలు వెంకటేశ్వరరావు, పవన్ ఆధ్వర్యంలో ఈపనులు చేపట్టారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

## 'సూపర్ సిక్స్' అమలుకు ప్రభుత్వంపై ఉద్యమించాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలిసిన జీలుగుమిల్లి మండల నాయకులు

బుట్టాయగూడెం: ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మభ్య పెడుతున్న కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. జీలుగుమిల్లి మండంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ పదవులు పొందిన నాయకులు మంగళవారం రాత్రి బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో బాలరాజు గృహంలో కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మిలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అవి ఆచరణకు రావడం లేదన్నారు. అదేవిధంగా మహిళల కోసం ఏర్పాటు చేస్తామన్న ఉచిత బస్సు ఊసే ఎత్తడం లేదని అన్నారు. రైతులకు రైతు భరోసా పథకం లేక ఖరీఫ్, రబీ సీజన్‌లో కూడా నానా కష్టాలు పడుతూ వ్యవసాయం చేశారని అన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. తల్లికి వందనం ఎప్పుడిస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని, అలాగే వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిగేటట్లు చేశారని, రాష్ట్రంలో ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరికో బెల్టుషాపు పెట్టి మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, జిల్లా కార్యాచరణ కార్యదర్శి బోదా శ్రీనివాసరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర సెక్రటరీ బూరుగు ఫ్రెడరిక్ ప్రేమ్‌కుమార్, నాయకులు సున్నం సురేష్, చిట్టిబొమ్మ శ్రీను, కొప్పుల సత్యనారాయణ, ఉప్పల రాంపండు, రంగుల రమేష్, వెంకట్, ఆకుల రవి, బొంతు వెంకట్, చిన్నరాముడు, వంకా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




### మే 11న సుందరగిరిపై నృసింహ జయంతి వేడుకలు


శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న రుత్వికులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి జయంతి (ఆవిర్భావ)వేడుకలు మే 11న వైభవంగా జరుగనున్నాయి. ఆరోజు స్వాతి నక్షత్రం, చతుర్దశి తిథి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 7.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు అర్చకులు, పండితులు విశేష ద్రవ్యాలతో అష్టోత్తర శతకలశ అభిషేకం నిర్వహిస్తారు. ఆ తరువాత సుదర్శన నృసింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూలమంత్ర హోమాలు, విశేష నివేదనలు, పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతాయని నృసింహ ఉపాసకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మి నరసింహ గురూజీ తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు. రూ.1,116 చెల్లించి ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే దంపతులకు స్వామివారి శేష వస్త్రంతో పాటు, ప్రసాదాలను అందిస్తారని చెప్పారు. వివరాలకు 99085 63958, 99122 81886 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


మద్ది క్షేత్రంలో హనుమాన్ చాలీసా పారాయణ

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో బారులు దీరి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెంనకు చెందిన శ్రీ విజయదుర్గ భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,43,328 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. 1200 మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థాన పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఏర్పాట్లు చేశారు.

### అంబేడ్కర్‌ను అవమానించిన కేసులో ఇద్దరికి రిమాండ్

భీమడోలు: రాష్ట్రీయ రహదారి పోలసానిపల్లి ఎస్సీ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను మంగళవారం భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 12వ తేదీ రాత్రి గుర్తు తెలియని అగంతకులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన విషయం అందరికి తెలిసిందే. ఈ ఘటనతో జిల్లాలో సంచలనం రేగింది. దీనిపై పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఉండి సాయి వీరాస్వామి, ఆతని తండ్రి ఉండి రాంబాబులను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. వారిని భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

## సమష్టిగా కృషి చేయాలి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసే దిశగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బీ.శ్రీలత అన్నారు. మంగళవారం ఏలూరులోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జిల్లాలోని ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీలత మాట్లాడుతూ జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలన్నారు. తొలుత పెండింగ్‌లోని కేసులపై విచారణ పూర్తిచేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం, నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడతామని చెప్పారు. కేసులు పెట్టినా మారకుంటే పీడీ యాక్ట్ ప్రయోగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కేవీఎం ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ.అవులయ్య, ఏఈ ఎస్.అజయ్‌కుమార్ సింగ్, పాండురంగారావు ఉన్నారు.

### ఆటో బోల్తా.. 9 మందికి స్వల్ప గాయాలు

నూజివీడు: మీర్జాపురంలో ఆటో బోల్తా పడి మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల ప్రకారం గొల్లపల్లికి చెందిన మహిళలు మంగళవారం సీతారామపురం వద్ద ఉన్న సమోసా తయారీ ఫ్యాక్టరీలోకి పనికి వెళ్లి సాయంత్రం తిరిగి ఆటోలో ఇంటికి వస్తుండగా మీర్జాపురం వద్దకు వచ్చే సరికి క్రేన్ తగిలి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 9 మంది మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. వీరందరిని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర: బుల్లెట్ మోటార్ సైకిల్ బొలెరో వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన పెనుమంట్ర- బ్రాహ్మణ చెరువు గ్రామాల మధ్యలో మంగళవారం రాత్రి జరిగింది. ఇద్దరు యువకులు, ఒక యువతి బుల్లెట్ వాహనంపై ప్రయాణిస్తూ దారిలో నడిచి వెళుతున్న ఒక యువతిని ఢీకొని అదుపు తప్పి ఎదురుగా వస్తున్నా బొలెరో వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో బుల్లెట్‌పై వెళుతున్న ముగ్గురితోపాటు రోడ్డుపై నడిచి వెళ్తున్న యువతికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. నడిచి వెళ్తున్న యువతి స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆ ముగ్గిరిని 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. వారు కర్ణాటకకు చెందిన వారని, నవుడూరులోని వివాహ వేడుక హాజరైనట్లు సమాచారం.

## క్లుప్తంగా

### 39 మంది వృద్ధులకు వైద్య సేవలు



వృద్ధులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

**తణుకు అర్బన్:** సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సీనియర్ వైద్యుడు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు 39 మంది వృద్ధులకు వైద్యసేవలందించారు. శిబిరానికి హాజరైన వృద్ధులకు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ తెలిపారు. తణుకు శాఖ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు మద్దా అలివేలు మంగమ్మ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

### చెత్త నుంచి సంపద సృష్టి



తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్

**తాడేపల్లిగూడెం రూరల్:** చెత్త నుంచి తయారైన కంపోస్టు ద్వారా సంపద సృష్టించొచ్చని సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో చెత్త సేకరణ, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ ఇళ్లల్లో తయారైన చెత్తను ఆరుబయట పారేయకుండా తడి, పొడి చెత్తగా విభజించి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. రోడ్లపై వేయడం వల్ల గ్రామ పారిశుద్ధ్యం దెబ్బతింటుందన్నారు. పారిశుద్ధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం తడి, పొడి చెత్తను వేరే చేసే ప్రక్రియను ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ వివరించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చంద్రరాజు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి ఆదేశాల మేరకు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తాడేపల్లిగూడెం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ టి.లక్ష్మీ సరస్వతి కోరారు. అంగన్వాడీ కార్యకర్త పట్టణంలోని 16వ వార్డు-3లో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో ఒక ఖాళీ ఉందని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా సహాయకురాలి పోస్టులకు పట్టణంలోని 20వ వార్డు-3లో బీసీ-డీ కేటగిరిలో, 28వ వార్డు-1లో బీసీ-ఏ కేటగిరిలో, 34వ వార్డులో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో ఖాళీలు ఉన్నాయని దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని, ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ప్రత్తిపాడు పంచాయతీ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

**పెంటపాడులో..**

**పెంటపాడు:** తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ కార్యకర్తలు, పది సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ కేటగిరి విధానంలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు, ప్రత్తిపాడులోని అంగన్‌వాడీ సీడీపీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### ముగిసిన నవమి ఉత్సవాలు



పూజలందుకుంటున్న కోదండ రాముడు

**పెంటపాడు:** ప్రత్తిపాడు కోదండ రామాలయంలో ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న సీతారామ కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా వేంకటేశ్వర స్వామి కల్యాణం, స్వామి వారికి పవళింపు సేవ, భజన కాలక్షేపం, పౌరాణిక, జానపద, కూచిపూడి నృత్యాలు, భజన కాలక్షేపాలు ఘనంగా నిర్వహించారు. చెల్లూరి వెంకట రమేష్, వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు వీర్ల గోవింద్, వీర్ల ధనరాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# కోకో రైతుకు కడగండ్లు



తాడేపల్లిగూడెం మండలంలో సాగు చేస్తున్న కోకో పంట



కోకో కాయలు

- స్థిరంగా లేని ధరతో సతమతం
- మార్చిలో కిలో రూ.700
- నేడు రూ.550 కు పతనం
- స్థిరమైన ధర నిర్ణయించాలంటూ రైతుల మొర

**తాడేపల్లిగూడెం రూరల్:** వాణిజ్య పంటగా ఉన్న కోకో పంట పండించిన రైతుకు కడగండ్లు తప్పడం లేదు. ఏడాది పొడవునా పంట పండించే అవకాశం ఉండటం, ధర స్థిరంగా లేకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే 4,219 ఎకరాల్లో కోకో పంట పండిస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా కడియద్ద 982 ఎకరాలు, కొమ్ముగూడెం 796ఎకరాలు, వీరంపాలెం 672 ఎకరాలు, జగ్గన్నపేట 407 ఎకరాలు, వెంకట్రామన్నగూడెంలో 314 ఎకరాలు, కుంచనపల్లిలో 301 ఎకరాలు, బంగారుగూడెంలో 285 ఎకరాలు, పెదతాడేపల్లిలో 265 ఎకరాలు, కొండ్రుప్రోలు 78 ఎకరాలు, ఆరుగొలనులో 50 ఎకరాలు, అప్పారావుపేటలో 43, జగన్నాథపురంలో 22 ఎకరాల్లో కోకో పంట సాగవుతుంది. ఎకరం పంట సాగు చేస్తే రూ.1.50లక్షలు పెట్టుబడి అవుతుంది. ఎకరానికి మూడు క్వింటాళ్లు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. డిసెంబరు నుంచి ఏప్రియల్ మధ్యలో అత్యధిక పంట వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కోకో గింజలు కిలో గత ఏడాది జనవరిలో 800 నుంచి వెయ్యి రూపాయలు పలికింది. ఈ ఏడాది జనవరిలో కోకో గింజలు రూ.700లు, మార్చిలో రూ.600లు వరకు ధర పలికింది. అయితే, ప్రస్తుతం కిలో రూ.550లు లభిస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాదిలో కిలోకు దాదాపు రూ.150లు ధర తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### స్థిరమైన ధర అందించాలి



కోకో పంట అంతర్జాతీయ మార్కెట్‌కనుగుణంగా ధర ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు ఏ ధర ఉంటుందో అర్థం కావడం లేదు. మార్కెట్‌లో వచ్చే ధరకు, ఖర్చులకు అసలు పొంతన ఉండటం లేదు. కోకో పంటకు స్థిరమైన ధర అందించాలి. లేకుంటే కోకో పంట పండించలేని పరిస్థితి.

– అంగిన నాగేశ్వరరావు, కౌలు రైతు, కొండ్రుప్రోలు తాడేపల్లిగూడెం మండలం

### కోకోకు దళారుల బెడద



కోకో పంటకు మధ్య దళారుల బెడద ఉంది. రైతు వద్ద తక్కువకు కొనుగోలు చేసి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. దీని వల్ల ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు నష్టాలే తప్ప రూపాయి మిగలని పరిస్థితి.

– పరిమి గంగారావు, రైతు, చినతాడేపల్లి, తాడేపల్లిగూడెం మండలం

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

**తణుకు అర్బన్:** చనిపోయిన, ఆరోగ్యం బాగోని మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్. ఆదినారాయణ బాబు, కార్యదర్శి గుబ్బల గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాడ్యూటీ ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మికులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సీఐటీయూ నాయకులు ఆర్జి కృష్ణబాబు, అనంతలక్ష్మి, రాణి, మందులయ్య, రమేష్, జ్యోతిబాబు, నాగేంద్ర కుమార్, రాజమ్మ, సోంపద్మ, గంగాధర్, సురేష్, లోవరాజు, రమణ, రాజేశ్వరి, కృష్ణారావు, కుసుమ, శ్రీను, నాని, శ్రీరాములు పాల్గొన్నారు.

## దోమలను లార్వా దశలోనే నివారించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**తాడేపల్లిగూడెం రూరల్:** దోమలను లార్వా దశలోనే నివారించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో డ్రైడే, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటికుంటలు లేకుండా చూడాలని సూచించారు. నీటి కుంటలు ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల లార్వాలను గుర్తించి వాటిని నాశనం చేయాలన్నారు. తద్వారా వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుగుణ, ధనమ్మ, ఆశా కార్యకర్తలు రత్నకుమారి, ప్రశాంతి, రమణ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

**దోమ కుట్టరాదు.. పుట్టరాదు**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దోమ కుట్టరాదు.. పుట్టరాదని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరు సచివాలయాల ప్రాంతాల్లోనూ, పీఅండ్‌టీ కాలనీ పలు వార్డుల్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలకు ఆరోగ్య అవగాహన, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒకసారి డ్రై డే పాటించాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలని, దోమ తెరలు వాడాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త మేరీ, ఆశా వరలక్ష్మి, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ప్రజలు, మాల్ సిబ్బంది



తణుకు అర్బన్: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపకకేంద్రం అధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో మంగళవారం రెండో రోజు రైల్వే స్టేషన్, బస్టాండ్, జీవీ మాల్ వద్ద ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే సిబ్బంది, బస్సుడిపో సిబ్బంది, ప్రయాణికులు, షాపింగ్‌మాల్ సిబ్బంది హాజరై మాక్ డ్రిల్ తిలకించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. రామారావు మాట్లాడుతూ ప్రజలు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదాలపై అవగాహన**

**తణుకు అర్బన్:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో తణుకు అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ ఐ.అజయ్‌కుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఏ రకంగా అదుపు చేస్తారో ప్రయోగాత్మకంగా చూపించారు. అనంతరం ప్రయాణికులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపే కరపత్రాలను అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**జాగ్రత్తలు అవసరం**



అత్తిలి: కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక అధికారి గంగరాజు

**అత్తిలి:** అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని అత్తిలి అగ్నిమాపక అధికారి కొవ్వాసు గంగరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అత్తిలి అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు నివారణ చర్యలను, అగ్ని ప్రమాదాల నిరోధక నినాదాలు ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కర పత్రాలను పంచుతూ అత్తిలి బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, రిలయన్స్ షాపింగ్ మాల్ వద్ద డెమో నిర్వహించి అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. బ్యాంకు వీధి, పెమ్మరాజువీధి, తణుకు రోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్డులో పర్యటించి జన సమూహాల ప్రాంతాల్లో పలు రకాల అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యల గురించి అగ్నిమాపక అధికారి కె.గంగరాజు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణికుల నీడ కోసం గ్రీన్‌షెడ్ల ఏర్పాటు



ఎన్‌టీఆర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షెడ్



తాలూకా సెంటర్‌లో వేసిన గ్రీన్ షెడ్

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు వేసవి ఎండ తీవ్రతను తగ్గించేందుకు బస్సు షెల్టర్ల వద్ద గ్రీన్ షేడ్ (నీడ ఇచ్చేందుకు) చలువ పందిర్లు పురపాలక సంఘం కమిషనర్ ఏసుబాబు, ఏఈ వెంకట రమణ ఆధ్వర్యంలో పట్టణంలో 9 ప్రాంతాల వద్ద ఏర్పాటు చేశారు. పందిర్ల వద్ద వేసవి చలివేంద్రాలు (నీటి మట్టి కుండలు) ఏర్పాటు చేసి, దాహార్తులకు నీరు అందే విధంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వన్ టౌన్‌లో ఎస్‌వీఆర్ సర్కిల్, కడకట్ల, బస్సు స్టాండ్, తాలూకా సెంటర్, ఎన్‌టీఆర్ బొమ్మ, నిట్ కళాశాల వద్ద అదే విధంగా టూ టౌన్‌లో జువ్వలపాలెం, తణుకు బస్సు స్టాప్, తాళ్లముదునూరుపాడు ప్రాంతాల్లో ఈ గ్రీన్ పందిర్లు వేశారు. ఇది ఇలా ఉంటే పోలీస్ ఐలాండ్ సమీపంలో భీమవరం రూట్‌లో వెళ్లే ప్రయాణికుల కోసం, అదే ప్రాంతంలో ఏలూరు రూట్‌లో వెళ్లే ప్రయాణికులకు ఎటువంటి గ్రీన్ షెడ్ పందిర్లు వేయలేదు. బస్సుల కోసం ఎదురు చూస్తు రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో గ్రీన్ షెడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ముగిసిన అమ్మవారి ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**పెంటపాడు:** పెంటపాడు గ్రామదేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. 130 ఏళ్ల క్రితం బందారు వంశీకుల ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి ఏటా ఉగాది పురస్కరించుకొని భారీగా ఉత్సవాలు చేయడం, అమ్మవారికి కుంభారాధన పోయడం ఆనవాయితీ. కాగా ఈ ఉత్సవాలు ఉగాది నుంచి మంగళవారం వరకు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బండారు సత్యనారాయణతో పాటు, ఆలయ కమిటీ సభ్యులు కర్రి సుబ్బిరెడ్డి, కొవ్వూరి శ్రీరామరెడ్డి, సెనగన శ్రీనివాస్, బండారు సత్యవరప్రసాద్, తేతలి సుబ్బిరెడ్డి, బేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, శనగన చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతకు మాజీ మంత్రి పరామర్శ



ఉండ్రాజవరపు గోపిని పరామర్శిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

**పెంటపాడు:** వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ నిత్యం అండగా ఉంటుందని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకుడు ఉండ్రాజవరపు గోపి తీవ్ర అస్వస్థతతో ఆపరేషన్ చేయించుకొని ఇంటివద్ద వైద్యం పొందుతున్నారు. అయితే మంగళవారం కొట్టు సత్యనారాయణ గోపిని, వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. వార్డు సభ్యులు మారంపూడి ఏసుదాసు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సలుమూరి ప్రకాష్, పార్టీ నాయకులు కర్రి బాస్కరరావు, చెన్నా జనార్ధన్, కొలుకులూరి ధర్మరాజు, బొద్దాని శ్రీనివాస్, గోకా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘ యువత అధ్యక్షుడిగా కామేష్



సూరంపూడి కామేష్

**తణుకు అర్బన్ :** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా తణుకుకు చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నిక ఇది మూడోసారని, హాట్రిక్ సాధించడం సంతోషంగా ఉందని కామేష్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి తిరిగి బాధ్యతను అప్పగించిన బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఏలూరు అంబిక గ్రాండ్‌లో కమిటీ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేసినట్లు వివరించారు. కామేష్ ఇటీవలే తణుకు బార్ అసోసియేషన్‌కు మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించడం విశేషం.

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్థానిక ఏలూరు రోడ్డులో వేంచేసి యున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో అయ్యప్ప స్వామి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పూర్వాధ్యక్షుడు గురుస్వామి నటరాజు ఆధ్వర్యంలో విశేషంగా భక్తులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



## ప్రసాద్‌కు కవితా పురస్కారం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

**తణుకు అర్బన్:** అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 13న నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో కవి వీఎస్‌వీ ప్రసాద్ కవితా పురస్కారం అందుకున్నా రు. కవి ప్రసాద్ రచించి, వినిపించిన విశ్వసిస్తూ- శ్వాసిస్తూ అనే శీర్షిక కలిగిన కవితకు ఆహూతుల నుంచి ప్రశంసలు లభించాయి. ఈసందర్భంగా కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతా ప్, అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.

## స్విమ్మింగ్ పూల్ పనులను ప్రారంభించండి

సాక్షి స్పందన



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో స్థానిక కడకట్ల ప్రాంతంలో ద్వారకానగర్ రోడ్డు నెంబర్ 5లో శిథిలమైన స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. స్విమ్మింగ్ పూల్ (ఈతకొలను) వినియోగంలోకి రాకుండానే శిథిలమైందని, స్విమ్మింగ్ పూల్ వస్తుందన్నకున్న యువత ఆశలు అడియాసలు కావడంతో తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని యువత కోరుతున్నట్లు సాక్షిలో మార్చి 28 శుక్రవారం స్విమ్మింగ్ పూల్ పనులకు ఎదురీత అనే శీర్షికన కథనం వెలువడింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు మంగళవారం స్విమ్మింగ్ పూల్ ప్రాంతాన్ని పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ చేయాలని, మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



టీకే రాజేష్, ఏవో

**అత్తిలి:** రైతుల పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరను పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. దాళ్వా సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం 14 క్లస్టర్‌లలో రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈసీజన్‌లో మండలంలో 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించారని చెప్పారు. 9 లక్షల 25 వేల గోనె సంచులు అవసరం కాగా ప్రస్తుతం రెండు లక్షల సంచులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ధాన్యం తేమ శాతం 17 శాతం ఉంటే గోనె సంచులు అందజేస్తారన్నారు.

## తారుమారైన వినూత్న ప్రయోగం

- విఫలమైన వీధి కుక్కలను తరిమే యత్నం



ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన ఎర్ర రంగు బాటిళ్ల వద్ద తిష్ట వేసిన కుక్క

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వీధి కుక్కలను తరమడానికి ప్రయోగించిన వినూత్న ప్రయోగం విఫలమైంది. వివరాల్లోకి వెళితే వీధి కుక్కలు రాకుండా ఉండేందుకు ఎర్ర రంగు కలిపిన నీటి బాటిల్స్‌ను ఇళ్ల బయట, కొన్ని ఆసుపత్రులు గేట్ల వద్ద ప్రజలు ఉంచుతున్నారు. ఈ బాటిళ్లను ఎందుకు ఉపయోగిస్తున్నారో తెలియక జనం తికమకపడుతున్నారు. అయితే వీధి కుక్కలను తరిమికొట్టేందుకు కొంత మంది ప్రజలు ఈ ఎర్రటి సీసాలను ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ఈ ఎరుపు రంగు కుక్కల కళ్లకు చికాకును తెప్పిస్తాయని, దీంతో అవి దూరంగా ఉంటాయని, వీధి కుక్కలు బెడద తగ్గుతుందని భావించారు. అందుకు భిన్నంగా ఆ బాటిళ్ల వద్దకు వచ్చి కుక్కలు తిష్టవేయడం విశేషం. ఎర్రరంగు బాటిళ్లను ఏర్పాటు చేసిన వారిని వివరాలు అడుగగా కుక్కలను తరిమేందుకు ఈ ఎర్ర రంగు బాటిళ్లను ఇళ్ల బయట ఉంచుతున్నారని, తాము కూడా ఆ విధంగా చేశామని, కుక్కలు ఎర్ర రంగు బాటిళ్లకు ఏ మాత్రం బెదరడం లేదని, రోజూ చాలా కుక్కలు వచ్చి పోతున్నాయని వాపోయారు.